
సాక్షి పల్నాడు

శుక్రవారం ı 1 ı మార్చి ı 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 516.30 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఏఎన్‌యూలో మార్చి 30, 31 తేదీల్లో 'రోబోటిక్స్‌'పై నిర్వహించనున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్ పోస్టర్‌ను గురువారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు.

భక్తాంజనేయ స్వామికి పూజలు



సత్తెనపల్లి: అరకాలీల బజార్‌లో వేంచేసి ఉన్న భక్తాంజనేయస్వామి వారి దేవస్థానం 24వ వార్షికోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

'సిద్ధం'సభ ఏర్పాట్ల పరిశీలన



మేదరమెట్ల: 'సిద్ధం' సభ కోసం చేస్తున్న ఏర్పాట్లను సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు మండలం పీ.గుడిపాడు వద్ద మార్చి 10న జరగబోయే సభకు హాజరయ్యేవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. అందులో భాగంగానే తాను ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి, నాయకులు ఉన్నారు.

వైద్య విద్యార్థులకు అభినందన



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల విద్యార్థులు క్రికెట్ ట్రోఫీ సాధించడంతో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి గురువారం అభినందించారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ క్రికెట్ పోటీలు రాజమండ్రిలో జరిగాయి. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో రాణించి కళాశాల పేరు ప్రఖ్యాతలు ఇనుమడింపచేస్తున్నారని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు సాగర్ కుడికాలువకు నీటి విడుదల

విజయపురిసౌత్:కృష్ణానది యాజమాన్య బోర్డు ఉత్తర్వుల మేరకు తాగునీటి అవసరాల నిమిత్తం గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు మూడు టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు మాచర్ల ఓ అండ్ ఎం ఈఈ శ్రీహరి గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కేఆర్‌ఎంబీ కార్యదర్శి డీఎం రాయపురే పర్యవేక్షణలో నీటి విడుదల జరుగుతుందన్నారు. ఈ నీటి విడుదల తొమ్మిది రోజుల పాటు కొనసాగుతుందన్నారు.

సుబ్బారాయుడికి వెండి నాగపడగ సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి చీరాల వాస్తవ్యులు పసుపులేటి శ్రీనివాసరావు రూ. 95 వేల విలువగల కిలో 135 గ్రాములతో చేసిన వెండి నాగపడగ ఆలయ అధికారులకు అందజేశారు. మరో భక్తులు అవనిగడ్డకు చెందిన పరిశె మణికుమార్ 280 గ్రాములతో తయారు చేసిన వెండి అర్ధ కిరీటం అందించారు. గురువారం విడివిడిగా ఆలయానికి విచ్చేసిన వారు తొలుత స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

యార్డుకు 1,40,562 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,40,563 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,30,229 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,06,923 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

విజయోస్తు..



ప్రశ్నపత్రాల సెట్‌ను పోలీస్‌స్టేషన్‌కు పంపడాన్ని పర్యవేక్షిస్తున్న పల్నాడు డీఐఈఓ నీలావతిదేవి

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- జిల్లాలో 48 కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 31,088 మంది విద్యార్థులు



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అబ్జర్వర్లు కృష్ణకాంత్, అరవింద్

విద్యార్థులకు సూచనలు...

- పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, బ్లూ టూత్, డిజిటల్ వాచీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు.
- ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. హాల్ టికెట్‌పై ఫొటో తప్పనిసరి.

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ వార్షిక పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షల నిర్వహణకు పల్నాడు జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం, ఒకేషనల్ విద్యార్థులు కలిపి 31,088 మంది కానున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అములులో ఉంటుంది. మాస్ కాపీయింగ్ ఆస్కారం లేకుండా కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా ఆదేశాలు ఇచ్చారు. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. నిముషం ఆలస్యమైనా లోపలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏ పరీక్ష కేంద్రంలో కూడా నేలబారు పరీక్షలకు వీలు లేకుండా పూర్తిస్థాయిలో ఫర్నిచర్ ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకు న్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఆ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోనున్నారు.

పూర్తిస్థాయిలో పర్యవేక్షణ

జిల్లావ్యాప్తంగా పరీక్షల నిర్వహణ పర్యవేక్షించేందుకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ప్రతి రోజూ జిల్లాలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తాయి. విద్యార్థుల వద్ద చీటీలు లభిస్తే మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేస్తారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి చొప్పున 48 మందిని నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను, ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితోపాటు కస్టోడియన్లు స్టోరేజ్ పాయింట్లలో (సమీపంలో పోలీస్ స్టేషన్ల లో) భద్రపరిచిన ప్రశ్నపత్రాలను కేంద్రాలకు సక్రమంగా చేరేలా ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తు నడుమ కేంద్రాలకు తీసుకెళ్లేలా కేంద్రాల పర్యవేక్షకులకు ఆదేశాలు జారీ చేశారు. సీసీ కెమెరాల ద్వారా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షించనున్నారు. జిల్లా స్థాయిలో డీఐఈవో కన్వీనర్‌గా ఐదుగురు సభ్యుల కమిటీ పరీక్షలు సజావుగా జరిగేలా చూస్తుంది.

కొండవీడుకు కొత్త వెలుగు



జీవ ధ్వజం వద్ద పూజల్లో మంత్రి విడదల రజిని

- లక్ష్మీనారాయణస్వామి ఆలయం పునరుద్ధరణ ఓ గొప్పవరం
- కొండవీడును గొప్ప పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం చేయడమే లక్ష్యం
- నగరవనం పేరిట నాలుగేళ్లలో రూ.15 కోట్లతో కొండవీడు అభివృద్ధి
- రూ.11 కోట్లతో రెండో దశ ఘాట్ రోడ్డు ఏర్పాటు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

యడ్లపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా కొండవీడుకు కొత్త వెలుగు తీసుకు రాగలిగామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. యడ్లపాడు మండలం కొండవీడు కొండపై గురువారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవదాయ, పురావస్తు, అటవీ శాఖల సహకారంతో రూ.76 లక్షలతో పునః నిర్మించిన ఈ ఆలయాన్ని మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరై ప్రతిష్ట మహోత్సవం చేశారు. ముందుగా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పండితులు పూర్ణకుంభంతో మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ట పూజలు నిర్వహించి గరుడు అళ్వార్, లక్ష్మీనరసింహస్వామి విగ్రహాలను వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్టగావించారు. అనంతరం జీవ ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. చివరిగా ఆలయ నిర్మాణ శిలాఫలకాన్ని, నిధుల వివరాలు తెలిపే బోర్డులను మంత్రి ఆవిష్కరించారు. యజ్ఞకర్తలుగా కల్లి శివారెడ్డి దంపతులు వ్యవహరించారు. అనంతరం మంత్రి రజిని మాట్లాడుతూ కొండవీడులో లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రతిష్టలో తాను భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆలయ నిర్మాణానికి రూ.45.60 లక్షలు కాగా, సదుపాయాల కల్పనకు రూ.30 లక్షలు, ప్రతిష్ట కార్యక్రమానికి మరో రూ.4 లక్షలు నిధులను ప్రభుత్వ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆలయంలో నిత్యం ధూపదీప నైవేద్య అర్చక నిర్వహణకు ప్రత్యేకంగా కోటప్పకొండలోని త్రికోటేశ్వర ఆలయ నిధులను ఏడాది కాలంపాటు ఈ ఆలయానికి అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి నెలా రూ.50 వేలు చొప్పున ఆలయ నిర్వహణకు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కొండవీడు గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రూ.15 కోట్లు వెచ్చించి సందర్శకులకు కావాల్సిన అన్ని సదుపాయాలు దశల వారీగా అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.వి.సుబ్బారావు, జాకీర్, ఎంపీటీసీ బి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మద్దూరి విజయబాలచంద్రారెడ్డి, నాదెండ్ల జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తానురావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు, దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ బి.మహేశ్వరరెడ్డి, పురావస్తుశాఖ ఏడి కే.నరసింహనాయుడు, ఎస్.వెంకట్రావు, ఏఈ శ్రీనివాసరావు, దేవదాయ శాఖ డీఈఓ తుమ్మ సత్యనారాయణ, నరసరావుపేట ఇన్‌స్పెక్టర్ కె.మంజూష, సూపరింటెండెంట్ జి.శ్రీధర్‌రెడ్డి, కార్యనిర్వహణ అధికారులు డీసీహెచ్ వెంకటరెడ్డి, పి.దుర్గారావు, ఎస్.మాధవరెడ్డి, స్థపతి సీహెచ్ శ్రీనివాసరావు, ఆలయ ఈవో చెన్నుపాటి శివయ్య, జేసీఎస్ కన్వీనర్ చింతారావు, మైనారిటీ సెల్ డైరెక్టర్ దరియాలి, కౌన్సిలర్లు యూసుబ్, మీరాబి, కరిముల్లా, పుల్లగూర భరత్, నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, మద్దూరి కోటిరెడ్డి, పఠాన్ తలహాఖాన్ అబ్బాస్‌ఖాన్స్ కందుల శ్రీకాంత్, కర్నాటి సుబ్బారావు, బశల శివరామకృష్ణ, కురుగుట్ల వెంకటరెడ్డి, శ్రీను నాయక్, సుభాని, మానం సాంబయ్య, బుజ్జి, షంషుజుహ, మోషే, వంశీ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి అస్థికలు నిమజ్జనం చేసి వస్తుండగా...

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మార్టూరు: తండ్రి అస్థికలను నిమజ్జనం చేసి వస్తూ ప్రమాదంలో కుమారుడు మృతి చెందిన విషాదకర ఘటన స్థానిక జాతీయ రహదారిపై ఇసుకదర్శి సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. హైవే అంబులెన్స్ సిబ్బంది, స్థానికుల వివరాల మేరకు.. మేదరమెట్లకు చెందిన గుడిపాటి నాగబ్రహ్మం (45) ఇటీవల మృతి చెందిన తమ తండ్రి అస్థికలను విజయవాడ కృష్ణానదిలో గురువారం ఉదయం నిమజ్జనం చేశాడు. తమ్ముడు సాంబశివరావుతో కలిసి బైకుపై తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. ఈక్రమంలో వీరు స్థానిక ఇసుకదర్శి ఫ్లెటోవర్‌పై రాజమండ్రి నుంచి పొదిలి వైపు వెళ్తున్న ఆటోను వెనక నుంచి తమ బైకుతో బలంగా ఢీకొట్టారు. ప్రమాద తీవ్రతకు వాహనం నడుపుతున్న నాగబ్రహ్మం తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బైకు వెనుక కూర్చొన్న నాగబ్రహ్మం సోదరుడు సాంబశివరావుకు స్వల్పగాయాలు కావడంతో హైవే మొబైల్ సిబ్బంది మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన సీఐ రాజశేఖర్ రెడ్డి ప్రమాదస్థలికి చేరుకొని నాగబ్రహ్మం మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలి

- బాపట్ల జిల్లా ఉద్యాన శాఖాధికారి జెన్నమ్మ
- పెదపులివర్రులో ఫామ్ ఆయిల్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న బాపట్ల జిల్లా ఉద్యాన శాఖాధికారి జెన్నమ్మ, పక్కన సంస్థ డైరెక్టర్ అభయ్‌గోయల్

పెదపులివర్రు(భట్టిప్రోలు): బాపట్ల జిల్లాలో ఫామ్ ఆయిల్ వృద్ధి చేసేందుకు అనుకూలమైన ప్రాంతాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన శాఖలచే గుర్తించబడినట్లు జిల్లా ఉద్యాన శాఖాధికారిణి పి.జెన్నమ్మ చెప్పారు. అజంతా సోయా లిమిటెడ్, ఏపీ ఉద్యాన శాఖ (బాపట్ల జిల్లా) సహకారంతో జిల్లాలో వేమూరు నియోజకవర్గంలో మొదటగా గుర్తించబడిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రుకు చెందిన రైతు నాదెళ్ల రామకోటేశ్వరరావు సాగు చేస్తున్న ఆరు ఎకరాల పంట పొలంలో ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. జెన్నమ్మ మాట్లాడుతూ జిల్లాలో ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ స్థాపించడానికి, నర్సరీ స్థాపించడానికి అజంతా సోయా లిమిటెడ్ కంపెనీకి అనుమతి లభించిందని, ఇందుకు జిల్లాలో ఉద్యాన శాఖ కూడా సహకారం అందిస్తుందని తెలిపారు. మార్కెట్‌లో రూ.250 ఫామ్ ఆయిల్ మొక్కను రూ.193 లకే నూరు శాతం సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని కోరారు. ఇందులో అంతర్ పంటగా మిర్చి తదితర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఈ పంట సాగుకు బోర్‌వెల్స్ తప్పని సరిగా ఉండాలని, మెట్ట ప్రాంతం అనుకూలంగా ఉంటుందని, నీటి వసతి అనుకూలంగా ఉన్న భూములకే ఈ సాగుకు అనుమతి లభిస్తుందని చెప్పారు. సంస్థ డైరెక్టర్ అభయ్‌గోయల్ మాట్లాడుతూ 25 సంవత్సరాల అనుభవంతో రైతులతో కలసి పనిచేశామని, పూర్తి స్థాయిలో రైతులకు వ్యవసాయ సలహా సేవలు, ఎరువులు అందిస్తామని ఎకరాకు 57 మొక్కలు నాటాలని మొదటి మూడేళ్ల వరకు వరి తప్ప అన్ని రకాల పంటలు అంతర్ పంటగా వేసుకోవచ్చని తెలిపారు. ఎరువులు, అంతర్ పంటలపై మొదటి నాలుగేళ్ల వరకు హెక్టారుకు రూ.42 వేలు, పంట కోత పరికరాలు, గెలల రవాణాపై సబ్సిడీ, బిందు సేద్యం పరికరాలపై సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. తుఫాను, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. అంతేకాక పర్యావరణానికి కూడా అనుకూలంగా ఉండి వర్షాలు కురవడానికి దోహద పడుతుందని తెలిపారు. సదస్సులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, నీలా రమేష్, సంస్థ కన్సల్టెంట్ కె.సుధాకరరెడ్డి, మేనేజర్ ఎస్ఎస్ బాషా, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ కె.బాలయ్య, వీహెచ్ఎలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో జీవించాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లెరూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంభించి సన్మార్గాన్ని ఎంచుకోవాలని సీనియల్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు చెప్పారు. పట్టణంలోని సబ్‌జైల్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు తమతోపాటు తమ కుటుంబ సభ్యులు సైతం ఇబ్బందులపాలు కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటి నుంచైనా రాగద్వేషాలను వీడి శాంతికాముకులుగా జీవించాలని సూచించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరాతీశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎల్.జగదీష్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన సీఎం జగన్

- 16గ్రామాలలో 12గంటలపాటు సుడిగాలి పర్యటన
- అనిల్‌కుమార్ యాదవ్, నంబూరులకు బ్రహ్మారథం
- కర్లపూడిలో మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ
- నెమలికల్లు, లేమల్లెలలో షాదీఖానాల ప్రారంభోత్సవం
- అమరావతి గురుకుల పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం
- అత్తలూరు పీహెచ్‌సీ, ఆర్బీకే నూతన భవనాల ప్రారంభం



లేమల్లెలో షాదీఖానాను ప్రారంభిస్తున్న సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నంబూరు

అమరావతి: నరసరావుపేట పార్లమెంట్ స్థానంలో ఒక బీసీ వ్యక్తిని నిలబెట్టి సీఎం వైఎస్ జగన్ కొత్త చరిత్ర సృష్టించారని లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని ఉంగుటూరు, ఎండ్రాయి, నరుకుళ్లపాడు, అమరావతి, ధరణికోట, దిడుగు, జూపూడి, నూతలపాటివారిపాలెం గ్రామాలలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాలలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలసి అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ ఆశీస్సులతో పల్నాడు జిల్లాకు వచ్చానన్నారు. సీఎం జగనన్న పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. బీసీలకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్.. 13 ఎంపీ స్థానాలను బీసీలకు కేటాయించారన్నారు. ఇకపై పల్నాడు జిల్లానే తన సొంత ప్రాంతంగా భావించి.. ఇక్కడే ఉంటానన్నారు. సొంత బిడ్డలా ఆదరించాలని కోరారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అందరికీ అభివృద్ధి ఫలాలు సమానంగా అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ఒక ఓటు, ఎంపీగా తనకు ఒక ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తే సీఎం వైఎస్ జగన్ బీసీలను గుండెల్లో పెట్టుకొని రాజ్యాధికారం ఇచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌ని గెలిపిస్తే పెదకూరపాడు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మండలంలోని కర్లపూడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మంచికలపూడి వీరరాఘవయ్య, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరించారు. నెమలికల్లులో గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అనిల్‌కుమార్ యాదవ్‌ను, నంబూరు శంకరరావులను గుర్రంబండిపై ఊరేగించారు. రూ.20లక్షలతో నిర్మించిన ముస్లింల షాదీఖానా, రూ.10లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఎండ్రాయి గ్రామంలో జేసీఎస్ మండల అధ్యక్షుడు నాయుడు రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అమరావతి అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో రూ.1.26కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు హష్మీ, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయకులు నంబూరు బాబురావు, చిల్కా సాంబయ్య, అలా లక్ష్మీనారాయణ, కోవూరు రాంబాబు, రాయపాటి శివ, ఉగ్గం యలమందయ్య, వెంకట్ సునీల్, నాగుల్‌మీరావలి, సైదావలి, నల్లిబోయిన శ్రీనివాసరావు, అమృతవేణి, నందూరు కరుణకుమార్, రోశిబాబు, ఆలపాటి వీరయ్య, కొండవీటి కోటేశ్వరరావు, సరిపూడి శివయ్య, నాగరాజు, వింతా బ్రహ్మారెడ్డి, వింతా శ్రీలక్ష్మి, శివనాగిరెడ్డి, తేళ్ల రోశయ్య, అన్నపాములు, జెట్టి పున్నారావు, దేవకుమార్, పుల్లారెడ్డి, సైదారెడ్డి, బంకా విష్ణు, మస్తాన్ షరీఫ్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు వీరే..

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికలకు జిల్లా నోడల్ అధికారులుగా 16మంది అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ ఉత్తర్వులు జారీచేశారు. డీపీఓ ఎం.వి.భాస్కరరెడ్డి, ప్రత్యేక డెప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీదేవి, జిల్లా రవాణాశాఖ అధికారి టీకే పరంధామరెడ్డి, ఎంపీడీవో సీహెచ్.చిన్నారావు, మైనింగ్‌శాఖ అధికారి ఎం.నాగిని, కోనేరు రంగారావు ప్రాజెక్ట్ ప్రత్యేక డెప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్, డెప్యూటీ కలెక్టర్ కె.ఉమారాణి, జిల్లా సెరీకల్చర్ అధికారి ఎ.బాలసుబ్రమణ్యం, పౌరసంబంధాల శాఖ డీడీ ఏ.ఎస్.దీప్తి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సంజీవరావు, జిల్లా ఎకనమికల్, స్టాటిస్టికల్ ఆఫీసర్ జి.శ్రీనివాస్, అసిస్టెంట్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి కె.సూర్యప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు.

క్లుప్తంగా

పార్లమెంటు వైఎస్సార్ సీపీ పరిశీలకుడిగా రేపాల



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ పార్లమెంటు నియోజకవర్గ రాజకీయ పరిశీలకుడిగా ఆర్‌టీఐ మాజీ కమిషనర్ రేపాల శ్రీనివాసరావును ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దీనిపై శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గంతో పాటు ప్రతి అసెంబ్లీ సీటు గెలిచేందుకు తన వంతు సహకారం అందజేస్తానని స్పష్టం చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.3లక్షల విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం గ్రామంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త జిల్లా ప్రసాద్, విజయలక్ష్మి దంపతులు రూ.3లక్షలు విరాళమిచ్చారు. గురువారం ఆలయ కార్యాలయంలో నగదును ఈవో టి.సుధాకరరెడ్డికి అందజేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొత్త సాంబశివరావు, ఆలయ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ ఆత్మకూరి రాజేంద్రప్రసాద్, అర్చకులు ఉన్నారు.

మహిళల వేషంలో చోరీలు

నిందితుడిని అరెస్టు చేసిన నల్లపాడు పోలీసులు

గుంటూరురూరల్: జల్సాలకు అలవాటు ఓ దొంగ, మహిళల వేషం ధరించి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఫిబ్రవరి 16వ తేదీన రూరల్ మండలం హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు చేధించి నిందితుడిని రిమాండుకు పంపారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా సూర్యాపేట మండలం రాయణగూడెంకు చెందిన బొంత యాదగిరి మద్యం, సిగరెట్లు వంటి వ్యసనాలకు బానిసయ్యాడు. అప్పుడప్పుడు కూలి పనులకు వెళుతూనే, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించేందుకు దొంగతనాలు చేసేవాడు. అనేక దొంగతనాలు చేసి జైలుకు కూడా వెళ్లాడు. 2023 నవంబరులో తనపై ఉన్న కేసులన్నీ కొట్టి వేయడంతో హైదరాబాద్ చర్లపల్లి జైలు నుంచి బయట కొచ్చాడు. ఈ నేపథ్యంలో గుంటూరులోని పలు ప్రదేశాలలో తిరుగుతూ దొంగతనం చేసేందుకు మహిళ వలే చీర, జాకెట్లు ధరించడం లేదా ముస్లిం మహిళ మాదిరి బురఖా ధరించడం, పంజాబీ డ్రస్సులు ధరించి రాత్రిళ్లు తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారం, వెండి, ఇతరత్రా వస్తువులను దొంగిలిస్తుంటాడు. అంతేకాకుండా ఇంటి బయట, లేదా రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉన్న బైక్‌లు దొంగిలించి, వాటితో జల్సాగా తిరుగుతుంటాడు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం స్థానిక రైల్వేస్టేషను సమీపంలో నల్లపాడు సమీపంలో పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. అతినివద్ద నుంచి హెచ్‌పీ ల్యాప్‌టాప్, హానర్ ట్యాబ్, ఆరు గ్రాముల బంగారు చెవి బుట్టలు, పది గ్రాముల వెండి పట్టీలు, ఏడు గ్రాముల వెండి ఉంగరం, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ రాంబాబు తెలిపారు.

నకిలీ కరెన్సీ మారుస్తున్న ఇద్దరి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: నకిలీ కరెన్సీ నోట్లు మారుస్తున్న ఇద్దరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీటీ రోడ్డు లక్ష్మీనగర్ పెట్రోలు బంకు వద్ద ఇద్దరు వ్యక్తులు నకిలీ కరెన్సీ నోట్లు మారుస్తున్నారు. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి ఇరువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారించగా కృష్ణయ్య అనే వ్యక్తి రూ.లక్షకు రూ. 2 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు ఇస్తుంటాడు. అప్పుల్లో ఉన్న వాసుదేవరావు రూ.10 లక్షలు నగదు కృష్ణయ్యకు ఇచ్చి నకిలీ నోట్లు తీసుకున్న క్రమంలో పోలీసులు ఇరువురిని పట్టుకున్నారు. ఇరువురి వద్ద నుంచి రూ. 10 లక్షలు నగదు, నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

గుంటూరు మెడికల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆయుర్వేదం, హోమియోపతి, యునాని వైద్య విభాగాలతో మార్చి 1న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు, నేషనల్ లివర్, గ్యాస్ట్రో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ వై.షేక్ చెప్పారు. గురువారం స్థానిక ఆర్.అగ్రహారంలోని నేషనల్ లివర్ అండ్ గ్యాస్ట్రో హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ చక్రధర్ ఆధ్వర్యంలో మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ సహకారంతో గుంటూరు మిర్చియార్డులో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా మెడికల్ క్యాంప్ జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు.

పవన్, బాబును ప్రజలే పాతాళంలో పాతిపెడతారు

- సిద్ధం సభ జనాభాలో పది శాతం కూడా జెండా సభకు రాలేదు
- జనసేన బ్యాలెట్ బాక్స్‌ల్లో ఓట్లు వెతుక్కోవడం ఖాయం
- ఇక రాజకీయాలొద్దు అని పవన్ అనడం తథ్యం
- ముస్లిం సోదరుడిని సమన్వయకర్తగా ప్రకటిస్తే ఓర్చుకోలేకపోయారు
- రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే శంకరరావును, నన్ను ఆశీర్వదించండి
- పెదకూరపాడు బహిరంగ సభలో అనిల్ కుమార్ యాదవ్
- మంచి చేశానని భావిస్తేనే ఓటు వేయండి: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సభలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్, పక్కన ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పవన్ కల్యాణ్, చంద్రబాబును పాతాళంలో పాతిపెట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నర్సరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. పెదకూరపాడులో రూ.8.30 కోట్లతో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడారు. జనసేన పార్టీని నమ్ముకున్న జనసైనికులను, అభిమానులను, కాపు సమాజికవర్గాన్ని హోల్ సేల్‌గా చంద్రబాబుకు పవన్ కల్యాణ్ అమ్ముకున్నారని విమర్శించారు. ఎన్నికల అనంతరం కౌంటింగ్‌లో బ్యాలెట్ బాక్స్‌లో జనసేన ఓట్లు వెతుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో పవన్ కల్యాణ్ ఇక రాజకీయం చేయను.. సినిమాలే చేస్తానని జనసైనికులను ముంచుడం తథ్యమన్నారు. బలంగా ఉన్నామని చెప్పుకునే గోదావరి జిల్లాలో టీడీపీ, జనసేన పెట్టిన జెండా సభలో ఖాళీ కుర్చీలే ఎక్కువగా దర్శనమిచ్చాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెడుతున్న సిద్ధం సభకి వచ్చిన జనంలో 10 శాతం కూడా జనం లేరని అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి కావాలనుకునే నేత కనీసం 40-50 సీట్లలో అయిన పోటీ చేస్తారని.. కేవలం 24 సీట్లకే పవన్ పరిమితమయ్యారని విమర్శించారు. అభివృద్ధి అంటే ఏమిటో సీఎం జగన్ చేసి చూపించారన్నారు. రూ.2 వేల కోట్ల నిధులతో పెదకూరపాడు నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధిని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అందించారని కొనియాడారు. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి సామాన్యుడైన ముస్లిం సోదరుడిని సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా ప్రకటిస్తే.. ఓర్వలేక వేల కోట్లు ఉన్న నేత పార్టీని వీడారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు 99 సీట్లు ప్రకటిస్తే కేవలం ఒక సీటు మాత్రమే... అది ఓడిపోయే సీటు ముస్లింకు ఇచ్చారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఏడుగురిని వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలుగా ప్రకటించారని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో తనను, ఎమ్మెల్యే నంబూరు శంకరరావును గెలిపించాలని ప్రజలను కోరారు.

మంచి చేశానని నమ్మితేనే ఓటు వేయండి

గడిచిన ఐదేళ్ల మంచి చేశానని నమ్మితేనే ఓటు వేయాలని, పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.2వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమం అందించామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఆ దమ్మూధైర్యంతో ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్నానని ఆయన స్పష్టం చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పని చేసిన వారు కనీసం తను చేసిన పనుల్లో పది శాతం కూడా చేయలేదని పేర్కొన్నారు. ప్రతి ఊరుకి రోడ్డు, ప్రతి వీధికి సీసీ రోడ్డు, ప్రతి పల్లెకు సంక్షేమం అందించామన్నారు. పెదకూరపాడు గ్రామంలో రూ.40 కోట్లతో అభివృద్ధి, రూ.50 కోట్లతో సంక్షేమం అందించినట్లు చెప్పారు. గతంలో ఇంటికి కుళాయి ఇవ్వాలంటే రూ.10వేలు తీసుకునేవారని, తాను మాత్రం ఉచితంగా ప్రతి ఇంటికి కొళాయి ఇచ్చానని స్పష్టం చేశారు. తాము చేసిన అభివృద్ధి చూపిస్తాం.. టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి చూపిస్తారా అని సవాల్ విసిరారు. నంబూరు కల్యాణ్ బాబు, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, వైద్య విధాన్ పరిషత్ అధికారి రంగారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి ఎంపీపీలు మీరయ్య, పేరయ్య, షేక్‌మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా ఉన్న సీఎం వైఎస్ జగన్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- ముటుకూరు పీహెచ్‌సీ భవనం ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: కరోనా లాంటి విపత్కర సమయంలో ప్రజలకు అండగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిలిచారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముటుకూరు గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. ముటుకూరు గ్రామంలో రూ.15 కోట్ల సంక్షేమాభివృద్ధి చేకూరిందని గణాంకాలతో వివరించారు. పేద వర్గాలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కరోనా సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ పక్క రాష్ట్రంలో ఉండి ప్రజల బాగోగులను పట్టించుకోకుండా, నేడు ఎన్నికల సమయం కావడంతో అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి రెండు మూడు లక్షల రూపాయల వరకు లబ్ధి చేకూరిందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇలా సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు వివరించాలని పీఆర్కే ప్రశ్నించారు. ఆయనను పలువురు నేతలు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ యలమంద మల్లు స్వామి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ నాసరయ్య, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, పార్టీ కన్వీనర్ పెద్దబ్బాయి, యూత్ కన్వీనర్ బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు నాగులేరుకు తరలించండి

కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కోరిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



నాగులేరు వద్ద జిల్లా కలెక్టర్ శివశంకర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

దాచేపల్లి: వేసవిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సాగర్ జలాలను నాగులేరు కాల్వకు తరలించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ శివశంకర్ గురువారం దాచేపల్లిలోని నాగులేరుని పరిశీలించారు. నీటి నిల్వలు లేక నాగులేరు పూర్తిగా ఎండిపోయిందని, దీంతో దాచేపల్లి నగర పంచాయతీతో పాటు కేసానుపల్లి, తక్కెళ్లపాడు, గామాలపాడు, శంకరపురం, భట్రుపాలెం గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమైందని కలెక్టర్‌కు ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి వివరించారు. ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని, రానున్న రోజుల్లో ఈ సమస్య జటిలమయ్యే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. సాగర్ కుడికాలువ నుంచి విడుదల చేసే నీటిని నాగులేరుకి మళ్లించాలని, దీంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లకు నీరందుతుందని చెప్పారు. నాగులేరులో నీటి నిల్వల కోసం గతంలో నిర్మించిన కత్వాల్‌లు శిథిలావస్థకు చేరితే వాటిని తొలగించి కొత్తగా నిర్మించామని, నాగులేరులో నీటిని నిల్వ చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్‌కి వివరించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. నాగులేరులో నీటి నిల్వల కోసం ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు. వారి వెంట నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్ బాషా, విజయ్‌కుమార్, నగర పంచాయతీ డీఈ సత్యనారాయణ, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ తదితరులున్నారు.

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష

గురజాల: భార్యను చంపిన కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ పదవ అదనపు జిల్లా జడ్జి జి.వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి తీర్పునిచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బారెడ్డి నాగిరెడ్డి వివరాల మేరకు.. మాచర్లకు చెందిన మస్తాన్‌బీని మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన షేక్ నాగుర్ వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. నాగుర్ పనికి వెళ్లకుండా భార్య మస్తాన్‌బీ చిత్రహింసలకు గురి చేస్తుండటంతో పలుమార్లు స్టేషన్‌లో, మత పెద్దల మధ్య రాజీ కుదిర్చారు. 2017 జులై 13న మధ్యాహ్నం మస్తాన్‌బీని ఇంటిలో ఎవరూ లేని సమయంలో భర్త నాగుర్ గడ్డపారతో తలపై కొట్టాడు. ఆమె తలకు తీవ్ర రక్తస్రావమైంది. ఈ క్రమంలో నాగుర్ అత్తమామలకు ఫోన్ చేసి, జరిగిన విషయం చెప్పాడు. బంధువులతో కలిసి ఇంటికెళ్లి చూడగా.. మస్తాన్‌బి మృతి చెంది కనిపించింది. మృతురాలి తండ్రి లాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎం.మధుసూదన్‌రావు దర్యాప్తు చేపట్టారు. విచారణలో నేరం రుజువుకావడంతో నాగుర్‌కు యావజ్జీవ కారగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

ఉద్యోగ విరమణ సంతోష జీవితానికి ఒక అవకాశం

విశ్రాంత అధికారులకు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి సన్మానం



విశ్రాంత అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీలు

నరసరావుపేట: ఉద్యోగ విరమణ అనేది కుటుంబం, బంధు మిత్రులతో కలిసి సుఖ సంతోషాలతో గడపటానికి వచ్చిన ఒక అవకాశంగా భావించాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన సీసీఎస్ సీఐ షేక్ మీరావలి, డీఎస్‌బీ ఎస్ఐ పి.వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి పట్టణ ఏఎస్ఐ కె.శ్రీహరికి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. వారిని ఘనంగా సన్మానించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అహర్నిశలు శ్రమించి, ఉద్యోగ విరమణ పొందటం కొంచెం బాధ కలిగిస్తుందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఏ అవసరం వచ్చినా.. పోలీస్ శాఖ తరపున తమవంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) రాఘవేంద్ర. అదనపు ఎస్పీ(ఏఆర్) రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ జీఎం గాంధీ, సీఐ ప్రభాకర్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యాలరావు, అధికారులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా సీఎం వైఎస్ జగన్

రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ గౌసుల్ ఆజం



మాట్లాడుతున్న చైర్మన్ గౌసుల్ ఆజం

లక్ష్మీపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల పవిత్ర హజ్ యాత్ర-2023లో విజయవాడ నుంచి అన్నివిధాల సదుపాయాలు, సౌకర్యాలను కల్పించి విజయవంతం చేశారని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ ఆజం అన్నారు. గుంటూరు బీఆర్ స్టేడియం వద్ద అంజుమన్ షాదీఖానాలో గురువారం హజ్ సర్వీస్ అండ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019-21 వరకు కోవిడ్ మహమ్మారి వల్ల హజ్ యాత్ర జరగలేదని గుర్తు చేశారు. 2022 సంవత్సరంలో హజ్‌కు గాను భారతదేశంలో ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 1164 మందికి గాను రూ.5.64 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. 2023లో 1813 మందికి రూ.14.50 కోట్లు ఆర్థికసాయం చేయడం జరిగిందన్నారు. ఈ రెండు సంవత్సరాలలో 2977 మంది యాత్రికులకు రూ.20.14 కోట్లు మంజూరు చేసి చరిత్ర సృష్టించారని గుర్తు చేశారు. హజ్ యాత్రికులకు అన్నివిధాల సౌకర్యాలు కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు చైర్మన్ గౌసుల్ ఆజంను ఘనంగా సత్కరించారు. హజ్ కమిటీ డైరెక్టర్ ముఫ్తీ బాసీద్, హజ్ సొసైటీ అధ్యక్షుడు మన్నన్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు కర్నూమా, గురువు ముఫ్తీ జిలానీ, ముజాహిద్, రహమతుల్లా ఖాన్ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చీరాలలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు డౌన్ మెయిన్ లైన్‌లో సమారు 45 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉన్నాడనే సమాచారంతో సిబ్బందితో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్ఐ చెప్పారు. అయితే మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, రైలును గమనించకుండా పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు ఢీకొని ఉంటుందని ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.